5068
శ్రీకాకుళం

# గొఱ్ఱ లోక

"మిమ్మల్ని పి.ఏ. గారు పిలుస్తున్నారు సార్" అన్నాడు ప్యూన్

"ఎందుకో?" లోలోపల అనుకుని బైటికి అనేశాడు

"నాకేం తెలుస్తుంది సార్" అన్నాడు పెదవి విరుస్తూ

"సరే! వస్తున్నా పద!"

ఫైలు మూసేసి కుర్చీలోంచి లేచాడు రమణారావు

పి.ఏ. డి.వో లెటరుయిచ్చి "అర్జంటుగా పుటప్‌చేసి ఫైలు యింటికి పంపు" అన్నాడు.

రమణారావు గడియారం వంక చూస్తున్నాడు. ఐదు కావటానికి యింకా పదినిమిషాలు కూడా లేదు.

రమణారావు మళ్ళీ ఒకసారి డి వో లెటరువంక చూశాడు. మూడు రోజులక్రింద పై ఆఫీసరు సంతకము వుంది దానికిప్పుడు క్షణాలమీద అర్జంట్. అసలు యీ అర్జంట్ అనేపదము ఎలా పుట్టిందో గాని తన ప్రాణం కొరికేస్తుంది. ఈ డి వో పుటప్ చేయాలంటే అధమం రెండు గంటలు టైము తీసుకుంటుంది. తను ఆఫీసునుంచి బయల్దేరేటప్పటికిఏడవు తుందన్నమాట.

రమణారావులో కలుగుతున్న విచిత్రమైన భావాలు కనిపెట్టి పి ఏ. ఎదురుగా కూర్చున్న జగన్నాధరావు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు

రమణారావు బైటికి వచ్చేశాడు. పి ఏ జగన్నాధరావు కలిసి వెళ్ళిపోయారు. వాళ్ళిద్దరూ ఎక్కడికి వెళతారో రమణారావుకి తెలుసు నైజాం స్వీట్ కార్నర్‌కి వెళ్తారు బాగా తింటారు టీ త్రాగుతారు కిళ్ళీలు నములుతారు. తర్వాత ఏ పార్కుకో వెళతారు. లేకపోతే సినిమాకో

రమణారావు ఆ డి.వో కు సంబంధించిన ఫైలు వెతుకుతున్నాడు. అది ఏమూల పడివుందో? బీరువా అంతా వెతికాడు పాత ఫైళ్ళన్నీ దులిపాడు వెధవ దుమ్ము లేస్తోంది.

గోడ గడియారము ఐదుగంటలు కొట్టింది. అందరికంటే ముందు లేడీటైపిస్టు రోజా లేస్తుంది. రోజాకంటే ముందుగా ఎవళ్ళూ లేవరు. ఒక్కొక్కళ్ళే జారుకుంటున్నారు

పది నిముషాలు తర్వాత ఫైలు దొరికింది. మూడు వాల్యూములు, పెద్ద కట్ట విసుక్కున్నాడు రమణారావు

డి.వో కు సంబంధించిన కాగితాలన్నీ చదువుతున్నాడు. అన్నీ చదివితేనే గాని అదేమిటో అంతుబట్టదు ఏదో నామకా పుటప్ చేస్తే వెళ్ళినఫైలు వెంటనే క్వొశ్చెన్ మార్కులతో తిరిగి వస్తుంది.

అందుకని రమణారావు పూర్తిగా చదివిగాని పుటప్ చేయడు. కాస్త ఆలస్యము అయినాసరే అందుకే రమణారావు ఫైలు చూస్తే సూపరింటెండెంటు గుడ్డిగా సంతకము పెట్టేసి పి.ఏ.కి పంపేస్తాడు

పి.ఏ గుడ్డిగా సంతకము పెట్టడు అందులో ఏదైనా చిన్న రంధ్రం దొరుకుతుందేమోనని వెదుకుతాడు ఏమాత్రం దొరికినా వదలిపెట్టడు. రమణారావంటే అంత శ్రద్ధ పి.ఏ.కి

వీలయినంతవరకూ రమణారావుని సాధించాలని చూస్తుంటాడు పి.ఏ తను వచ్చిన సంవత్సరంనుంచి మొండిగా నెట్టుకొస్తున్న రమణారావును తనేం సాధించాడో పి.ఏకి తెలియదు.

రమణారావు లంచం తీసుకోడు. నిష్కల్మషమైన నిస్వార్థజీవి. ముక్కుసూటిగా పోయేరకం. ఆ విషయము ఆఫీసులో అందరికీ తెలుసు.

రమణారావు లంచం తీసుకోక పోవటము వల్ల పి.ఏ.కి చాలా అవస్థలు కలుగుతున్నాయి కొన్ని కొన్ని ఫైళ్ళు అవకతవకగా వున్నాయి. పట్టుబడే అవకాశాలు కలుగవచ్చు. గుమాస్తా సహకారము లేందే ఫైళ్ళు సక్రమంగా నడపటము కష్టం.

పైళ్ళు క్షుణ్ణంగా చదివి పుటప్ చేసి పి ఏ కి పంపి బయల్దేరబోతున్నాడు రమణారావు.

ఇంతలో జగన్నాధరావు హఠాత్తుగా ఎక్కడ్నించో వూడిపడి "నమస్కారం....." అన్నాడు.

"నమస్తే ..." అన్నాడు రమణారావు కొంచెం తడబడ్డాడు.

"ఏడు దాటుతుంది. మీరింకా వున్నారే" అన్నాడు జగన్నాధరావు.

"కొంచెం పని తగిలి"

రమణారావు, జగన్నాధరావు రోడ్డుమీద కొచ్చారు

ఇద్దరూ నడుస్తున్నారు.

నైజాం స్వీట్ కార్నర్ లోంచి మంచి హిందీ రికార్డు వినిపిస్తోంది మధురమైన సంగీతం, వీణానాదంలాంటి గొంతు, చల్లటి వాతావరణము. రమణారావుకి ఉత్సాహం కలిగింది. నిలబడి పాట వినాలనుకున్నాడు. ఆ పాట వింటుంటే తెలియని ఆనందం ఏదో కలుగుతోంది.

"రండి సార్!..... కాఫీ త్రాగిపోదాం" జగన్నాధరావు రమణారావు చెయ్యి పట్టుకున్నాడు.

"యిప్పుడేం కాఫీఅండీ భోజనం వేళవుతోంది" అన్నాడు రమణారావు అయిష్టముగా. కాని లోలోపల యిష్టంగానేవుంది. కాఫీ త్రాగాలని లేకపోయినా ఆ హోటల్లో ఫ్యాన్ క్రింద కూర్చుని పాట వినాలని వుంది

"ఫరవాలేదు సార్....." జగన్నాధరావు చెయ్యి వదల్లేదు.

రమణారావు కాళ్ళు యాంత్రికంగా నడిచిపోయాయి.

జగన్నాధరావు ముఖం ఆనందముతో విప్పారింది.

రమణారావు యిలా తనవెంట హోటల్ కి రావటం అనేది చాలా గొప్పవిషయము. ఈ విషయము ఆఫీసులో తెలిస్తే తక్కిన గుమస్తాలు ఎంతో ఆశ్చర్యపోతారు.

"రసగుల్లా వుందా?" అన్నాడు జగన్నాధరావు.

"ఇప్పుడేం వద్దండి...." అంటున్నాడు రమణారావు.

"మీరూరుకోండి....అంటూ సర్వర్ వైపు తిరిగి లేకపోతే రెండు ప్లేట్లు దూద్ పేడా తర్వాత సమోసా" అన్నాడు.

రమణారావుకి ఒక్కసారిగా చదువుకున్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి కాలేజీలో చదువుకునేటప్పుడు పరీక్షల సమయములో రోజూ టీ త్రాగటానికి స్నేహితులతో పాటు యిక్కడికి వచ్చేవాడు తను ఇదే స్వీట్ కార్నర్ లో స్నేహితుల మధ్య కూర్చుని ఎప్పుడో పదేళ్ళక్రితం.

అప్పుడు తను ఇలా నీరసంగా వుండేవాడా? ఎంత బలంగా, ఎంత సంతోషంగా వుండేవాడు. దిగులు, చింత, బాధ్యతలు యివేమీ వుండేవికావు ఫుట్ బాల్ ని తంతే ఫర్లాంగుదూరము ఎగుగెత్తేది వాలీబాల్ కట్ కొడితే ఎవరూ ఎత్తేవాడే కాదు. కబాడీలో తన్ను మించినవాళ్ళు లేనేలేరు. తను కాలేజీ ఛాంపియన్ కాగలిగాడు. ఏ పనిలోనైనా ముందుండేవాడు.

ఒకసారి సంతకాల ఉద్యమం వచ్చింది కట్నాలుప్రబలి, ఆరుగురు పిల్లల తండ్రులు కట్నపిశాచికి బలైపోతున్న రోజులు తాము కట్నం తీసికోకుండా వివాహము చేసుకుంటామని ఆత్మసాక్షిగా సంతకాలు పెట్టమని ఉద్యమం కదిలింది.

అప్పుడు తను కాలేజీలో మొట్టమొదటి సంతకం ఎవరు పెట్టారు? తనే. అందరూ హర్షధ్వానాలు చేశారు. ప్రిన్సిపాల్ ఏమన్నాడు? నువ్వు నిజముగా కాలేజీ ఛాంపియన్ వే కాదు. ఆదర్శయువకులందరికీ ఛాంపియన్ వి."

తన తర్వాత ఎందరో సంతకాలు చేశారు వాళ్ళు తమ ఆత్మసాక్షిగా కట్నాలు తీసుకున్నారో లేదో తెలియదు.

కాఫీ త్రాగటం అయింది.

యిప్పుడు రమణారావు స్టేట్ఎక్స్ ప్రెస్ సిగరెట్ కాలుస్తున్నాడు. యింకొంచెం సేపట్లో కిళ్ళీగూడా వేసుకొంటాడు.

రమణారావు తల వంచుకొని ఆఫీసుకు రావటం, తల వంచుకొనే యింటికి వెళ్ళిపోవటం తప్ప ఆఫీసు వదిలిన తర్వాత ఇలా హోటల్‌కివచ్చి స్వీట్సు తినటం, కాఫీత్రాగటం, కిళ్ళీ నమలడం చెయ్యనే చెయ్యడు చెయ్య డానికి తగిన తాహతు తనకులేదు.

తోటి గుమాస్తాలంతా యిలాచేస్తూనే వుంటారు. దాదాపు రోజూ. వాళ్ళందరికీ తాహతువుంది. ఎందుకుంది? వాళ్ళూ తనలా గుమాస్తాలే గదా!

వాళ్ళందరికి రాబడివుంది లంచం తీసుకుంటారు, తనెందుకు తీసు కోడు? ఏమో తనకే తెలియదు.

జగన్నాథరావు నెమ్మదిగా అంటున్నాడు. "నాకు ఎలాట్ చేయవల సింది...."

"అవును, మీ కాగితం నాదగ్గిరే వుంది. నిన్ననేగా వచ్చిందిఅన్నాడు రమణారావు,

ఇలా అన్న వెంటనే వులిక్కిపడ్డాడు రమణారావు హోటల్ అంతా ఒక్కసారి కలయజూశాడు. తనకు తెలిసిన వాళ్ళలో ఎవరయినా వున్నారే మోనని. హమ్మయ్య ఎవరూ లేరు.

జగన్నాథరావు వంటి ధనికుడితో తనను యిలా చూస్తే యింకేమైనా వుందా?

"మా ఫైలు విషయం మర్చిపోకండి...." అంటున్నాడు జగన్నాథ రావు.

"లేదు పుటప్‌చేస్తాను అన్నాడు రమణారావు.

అలా అంటేకాదు, ఎలాగైనా పని జరిగేట్లు చూడాలి, మీమేలుమర్చి పోను, పి.ఏ.గారు గూడ భారమంతా మీమీదే వదిలారు, మీరు తల్చుకుంటే పని తప్పక జరుగుతుందన్నాడు"

రమణారావుకు కొంచెం గర్వంవేసింది పి.ఏ.కి తనంటే మంచిగురి వున్నమాట నిజం, కాని తను వాళ్ళ ముఠాలోకి జేరకుండా వున్నందుకు కోపం.

యిద్దరూ బైటికి వచ్చారు

ఇంతలో నల్లగా నిగనిగలాడుతున్న ఎంబాసిడర్ కారు వాళ్ళముందు ఆగింది.

జగన్నాధరావు డోర్ తెరుచుకుని లోపల కూర్చుని "రండి సార్! యింటికి డ్రాప్ చేస్తాను" అన్నాడు వినయంగా.

"థాంక్సు ...ఎందుకండీ నడిచి వెళ్ళిపోతాను, దగ్గరేగా...."అన్నాడు లోపలమాత్రం తను కారులోఎక్కి యింటిదగ్గర దిగాలనే వుంది, తనఆలోచనలకి తనే ఆశ్చర్యపోయాడు రమణారావు.

మీరు మరీ అంత మొహమాటపడరాదు, రండి—రండి సార్!" బలవంతపెట్టాడు జగన్నాథరావు-

ఎంబాసిడర్ కారు తమ యింటిముందు ఆగగానే ఆశ్చర్యపోయింది కాళింది. తలుపు ప్రక్కనే నిల్చుని ఎవరు వచ్చారా అని ఆత్రంగా చూడ సాగింది, అందులోంచి తనభర్త రావటంచూచి ఆమె ఆశ్చర్యం అవధులు దాటింది.

కారు దిగబోయేముందు జగన్నాధరావు రమణారావు పై జేబులో ఏదోకుక్కాడు, అతను అదేమిటో చూచేలోపల "నమస్కారం ఉంటాను సార్" అనే మాటలు వినిపించాయి.

కారు రివ్వున దూసుకుపోయింది.

రమణారావ్ నవ్వుతూ ఇంట్లోకి వచ్చాడు.

"ఏమిటి విశేషం? యివాళ కారులో వచ్చారు?" అన్నట్లు చూసింది కాళింది- "నాన్న....నాన్న" అంటూ పల్లలిద్దరూ కాళ్ళకు చుట్టుకున్నారు,

"కొంచెం అర్జంటుపని తగిలింది" అన్నాడు రమణారావు.

"హోటల్లో మేసి కిళ్ళీ నమిలేవనా?" అన్నది నవ్వుతూ

అప్పుడు తెలిసింది తను యిప్పుడే కిళ్ళీ నమిలినట్లు భార్య గ్రహించినదని-

"నీళ్ళు తోడుతున్నాను రండి"- అని కాళింది వెళ్ళిపోయింది

స్నానం చెయ్యటానికి షర్టు విడుస్తుంటే జేబులోంచి ఏదో బరువుగా పడింది, రమణారావ్ వంగి వాటిని చేతుల్లోకి తీసికొన్నాడు.

రెపరెపలాడుతున్న క్రొత్త వందరూపాయలనోట్లు, వణుకుతున్న చేతులతో లెక్కపెట్టాడు అయిదునోట్లు!

అయితే తను రెండునెలలపాటు చెమటోడ్చి సంపాయిస్తే అంతకంటే కొంచెం తక్కువే వస్తుంది, ఎంత సునాయాసంగా వచ్చిందీ డబ్బు, దీనికోసం తను ప్రత్యేకించి శ్రమపడవలసిందేమీ లేదు, లంచం అంటే ఇంత తేలిక కాబోలు

రమణారావ్‌కి హఠాత్తుగా వెంకటేశ్వర్లు జ్ఞాపకం వచ్చాడు, అతడు గుమస్తా పనిచేసి పదివేల కట్నం యిచ్చి పెద్దకూతురి పెళ్లి వైభవముగా చేశాడు, పెద్దకొడుకుని ఇంజనీరింగు చదివించాడు, చిన్నకొడుకు యం.బి. చదువుతున్నాడు. లంకంతకొంప కట్టించాడు, నెలజీతంలో కానీ మిగల్చలేని గుమస్తాకివన్నీ ఎలా సాధ్యమయ్యాయి? వెంకటేశ్వర్లు లాంటి వాళ్ల ఎంతమందో అతనివూహ కందలేదు

తనప్రక్కన కూర్చునే గుమస్తా టెర్లిన్‌సూట్ వేసి టింగ్ రంగా అని తిరుగుతాడు రోజుకో సినిమా చూస్తాడు, రోజుకో గులాబీని వెంటేసుకొని తిరుగుతాడు

పి.ఏ.గారు హైద్రాబాదులో యిళ్ళస్థలం యీమధ్యనే బేరం చేశాడు. తమఆఫీసరు హైద్రాబాదులోనే ద్రాక్షతోటలు వేయిస్తున్నాడు, ఆఖరుకు తమ ఆఫీసులో ప్యూను రాజయ్య మెయిన్‌బజార్లో పెద్దహోటల్ పెట్టించబోతున్నాడని అనుకుంటున్నారు.

లోకంలో అందరూ సుఖపడి పోతున్నారు, తనొక్కడే సామాన్యముగా బ్రతుకుతూ దరిద్రం అనుభవిస్తున్నాడు అనిపించింది రమణారావ్‌కి.

అసలు తనిలా మడికట్టుకొని కూర్చోటానికి కారణం ఎవరు? కాళిందికదూ? కట్నంలేకుండా పెళ్ళిచేసుకొన్నందుకు తనకు కొత్తలో రోజూ

కృతజ్ఞత వెలిబుచ్చేది, తను అప్పట్లో అంటే పిల్లలు పుట్టకముందు వరకూ కాళిందికి రోజూ ఆఫీసుగొడవలు గూడా చెప్పేవాడు, ఆ చనువుతో తనకే నీతులునేర్పేది, లంచం తీసుకోవటాన్ని భయంకరముగా వర్ణించేది, నిత్య జీవితములో అనేక పాపాలూ, మోసాలూ అవినీతిపనులు చేస్తూ, ఉదయమే లేచి పాపపరిహారానికి భగవంతుడికి పూజలు చేసేకన్నా పవిత్రంగా బ్రతకటము ఉత్తమం, పాపం చేసేవాళ్ల భగవంతుడికి కొబ్బరికాయ కొడితే ఆ పాపము పోయేట్లయితే భగవంతుడు గూడ లంచగొండి అన్నమాటేగా అటువంటి దేవుణ్ని పూజించటం శుద్ధదండగ, అసలు భగవంతుడు వేరే ఎక్కడో గుళ్లలో, గోపురాల్లో ఉన్నాడనుకోవటం ఎంత పొరపాటు. భగవంతుడు మనుష్యుల హృదయాల్లోనే ఉన్నాడు అనేది కాళింది, అలా తన జీవితవిధానమే మారిపోయింది.

అందరికన్నా అతీతముగా బ్రతుకుతున్నాననే తృప్తితో రోజులునెట్టే వేవాడు తను, కాని ముందుముందు తనిలాగేఉంటే ఎలా అనే ప్రశ్న ఉదయిస్తోంది. పద్మకు ఆరేళ్ళు నిండాయి, యింకో పదేళ్ళలో పెళ్ళి చేయాలి. రవికి నాలుగోఏడు. వాడిని బడిలో వేసి చదివించాలి-ఉషకు రెండో సంవత్సరము నిండబోతోంది.

ఏమైనా కాళింది అంచనా తప్పు అనిపిస్తోంది రమణారావ్‌కు, తన పిల్లల భవిష్యత్తుకోసమైనా సరే తను డబ్బు సంపాదించక తప్పదు, తనలా తనపిల్లలు గూడా వెంకటేశ్వర్లు కూతురిలా ఘనముగా చెయ్యాలి, రవిని ఇంజనీర్‌ని చెయ్యాలి, ఉషను డాక్టర్ చదివించాలి.

"ఏమిటండీ! ఎంతసేపు పిలవనూ? నీళ్ళు తోడాను" అంటూ వస్తున్న కాళింది మాటలు వినబడ్డాయి-

ఆరోజు వెన్నెల విరగ్గాస్తోంది, వెన్నెల్లోని చల్లదనము పట్టణాల్లో కనిపించని మాట వాస్తవమే కాని రమణారావ్ పెరట్లో మాత్రం వెన్నెల పిండారపోసినట్లుగుంది

కాళింది మంచాలు పెరట్లో వేసింది, పెద్దపిల్లలిద్దరూ చిన్నమంచం మీద నిద్రపోతున్నారు, రమణారావ్ భోజనము చేసిన తర్వాత తాంబూలము నములుతూ మంచముమీదకు చేరాడు.

కాళింది గూడా పనిపూర్తయ్యాక దొడ్డితలుపు తాళంవేసివచ్చి నడుం వాల్చింది రామారావుకు నిద్రపట్టడంలేదు. మాటిమాటికి జగన్నాథరావు, అతని వందరూపాయల నోట్లు కళ్ళలో మెదలసాగాయి.

అమాయకముగా నిద్రపోతున్న కాళింది ముగ్ధమోహనరూపము కనిపించింది· ఆదర్శాలకోసము జీవిత సుఖాలను దూరముగా నెట్టి కాలానికి అతీతముగా జీవించే ఆమెగొప్పా? రంగుటద్దాలలోంచి కనిపించేదే నిజమైన రంగనుకునే తను గొప్పా? తను ప్రశ్నించుకున్నాడు·

ఎన్నివిధాల ఆలోచించుకున్నా తనకంటే కాళిందే ఎంతో ఉన్నతురాలిగా అతీతురాలిగా కనిపించింది· ఆలోచించినకొద్దీ తన జీవితముపై అధికారము చెలాయిస్తున్న కాళిందిపై కోపము రాసాగినది· అందరిలాగా తను సుఖపడలేకపోతున్నాడని వాపోసాగాడు.

సుఖపడటము, పడకపోవటము అంతా తనచేతిలో ఉన్నది. అందుక్కావలసినదే డబ్బు డబ్బుతో సర్వప్రపంచాన్నీ పాదాక్రాంతం చేసుకోవచ్చు. ప్రపంచము డబ్బుమయము,డబ్బున్నవాడేదేవుడు లేనివాడు హీనాతిహీనుడు. అటువంటి డబ్బు నడిచివస్తుంటే కాళింది ఎందుకు అసహ్యించుకుంటుంది ?

కాళింది నిజంగా వెర్రిమనిషి కావచ్చు· కాళింది అంటేఎంత? కేవలము ఒక ఆడది. అటువంటిదాని మాట విని తను చాలా నష్టపడిపోయాడు అంతేకాదు· తను ఏ సుఖమూ పొందలేకపోతున్నాడు. డబ్బు సంపాదించటము వల్ల ఎంత ఆనందము వుంది? పెద్దమేడ కట్టిస్తాడు కాళింది వంటినిండా బంగారము నింపుతాడు. ఖరీదయిన చీరలుకొంటాడు. పద్మకు10వేలు కట్నముయిచ్చి మంచి సంబంధము తెస్తాడు. ఉష డాక్టర్ అవుతుంది.

డబ్బుంటే చుట్టపక్కాలకి కొదువేముంది? పెళ్లిళ్ళకు, పేరంటాలకు యిళ్లు కళకళలాడుతుంటే నిజముగా యెంత ఆనందముగా ఉంటుంది. రమణారావుగారంటే ఓహో ఫలానా ఇంజనీర్ గారి నాన్నగారు ....ఫలానా డాక్టరుగారి మామగారు....అనుకుంటే ఎంత గొప్పగా ఉంటుంది-

రమణారావ్‌కు తెల్లవారుజామున కోడి కూసేవరకూ నిద్రపట్టలేదు, తర్వాత నిద్రపోయాడు అదీ కలతనిద్రే ఆ నిద్రలోనే రకరకాల కలలు కన్నాడు, కాళింది బిల్డింగ్సు.... రవి బి.యి. డాక్టర్ ఉష....పద్మ పెళ్ళి చుట్టాలు, స్నేహితులు యిటువంటివి ఎన్నో కనిపించాయి-

ప్రొద్దున్నే లేచేసరికి రమణారావుకు కళ్లు మంటలుపుట్టాయి, మన సంతా మైకములో ఉన్నట్లయింది

"ఏమండీ అలాఉన్నారు? కళ్లెందుకు అలా ఎర్రబడ్డాయి?" అన్నది కాళింది.

"ఏమి లేదులే"....అని బద్దకముగా లేచాడు.

రమణారావ్ ఆరోజు ఆఫీసుకు వెళ్ళబోయేముందు వరకూ పర ధ్యానముగానే ఉన్నాడు, పదింటికి భోజనం వడ్డిస్తూ "మీరు ఏదోలా ఉన్నా రివాళ. ఏదయినా చెప్పగూడని విషయమా?" అన్నది కాళింది.

"అవును, నీకు చెప్పగూడని విషయమే!" అనుకున్నాడు లోలోపల పైకి నవ్వుతూ "ఎలా వున్నాను. మామూలే" అన్నాడు. అలా అంటున్న ప్పుడు అతనికి అతనిమీదే అసహ్యం వేసింది.

ఎన్నడూ లేనిది కాళిందితో అబద్ధాలాడుతున్నాడు తన మాటలు తనకే విచిత్రంగా వింతగా అనిపించసాగాయి. భార్య కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయాడు.

ఎలాగో భోజనంచేసి ఆఫీసుకెళ్ళాడు, వెళ్ళాడేగాని మనసంతా సంకో చముతో నిండిపోయింది, అందరూ తనని దోషిగా చూస్తున్నట్లనిపించింది. జగన్నాధరావు తనకిచ్చిన అయిదువందల సంగతి అందరికీ తెలిసిపోయినట్లు భ్రమపడ్డాడు మాటిమాటికీ అందరిపంకా వి త్తర చూపులు చూడడం మొదలు

పెట్టాడు. ఎవరూ తనని గమనించటంలేదని తోచిన తర్వాత జగన్నాధరావు సంబంధించిన ఫైలు తీశాడు.

మధ్యలో ఒకటి రెండు అర్జంటు ఫైలు పుటప్ చెయ్యటంవల్ల జగన్నాధరావు కేసు పూర్తయ్యేసరికి చీకటి పడిపోయింది వాచీవంక చూసుకున్నాడు. ఆరూ ముప్పావయింది.

ఆఫీసు ఆవరణదాటి బైటకొచ్చాడు బద్ధకంగా వుంది. రాత్రి నిద్ర లేకపోవటం వల్లో యేమో! కాళ్ళు తేలిపోవటం మొదలెట్టాయి. ఇంత నీరసంతో ఇంటివరకు నడవలేడనిపించింది.

అటుగా పోతున్న రిక్షాపిలిచి ఎక్కాడు రమణారావు దారిలో పూల కొట్టు దగ్గర రిక్షాఆపించి కాళిందికోసం మల్లెపూలు కొన్నాడు.

పూలపొట్లాం అందుకొనేటప్పుడు కాళింది ఎంత సంబరపడిపోయేదీ వూహించుకొంటుండగానే ఇల్లు వచ్చేసింది.

అరుగుమీద కూర్చుని ఉషను ఎత్తుకున్న బామ్మగారు రమణారావుని చూచి "తొందరగా రా నాయనా! నువ్వుంటే యింత ఘోరం జరుగకపోను అన్నది దిగులుగా"

రమణారావుకి గుండె గుభేలుమంది తండ్రినిచూచి రవిగాడు "నాన్నా నాన్నా!" అంటూ వచ్చాడు. పద్మ ఏడుస్తూ...."అమ్మ చచ్చిపోయింది" అన్నది.

రమణారావు కళ్ళు తేలిపోతున్నట్లనిపించింది. గుండెలు వేగముగా కొట్టుకుంటున్నట్లనిపించింది. కూలబడిపోయాడు. చేతిలో పూలపొట్లాం జారి క్రిందపడిపోయింది

కళ్ళలో నీళ్ళుతిరిగి బుగ్గలమీదుగా జారుతున్నాయి. పెదవులు అసహాయంగా వణుకుతున్నాయి

"కాళిందీ....కాళిందీ" అని గొణుక్కున్నాడు.

పారిజాతం చెట్టు మొదట్లో పొంచివుంది కాబోలు నాయనా! పాము కాటేసింది" అన్నది ఆమె.

అరుగుమీద కూర్చున్న రమణారావుని ఇరుగుపొరుగువాళ్ల సానుభూతితో చూస్తున్నారు. ఎదురింట్లో వున్న మురారివచ్చి "మీరు అలా అధైర్యపడకండి లేవండి. హాస్పిటల్‌కి వెళదాం" అన్నాడు.

రమణారావు ఏమీ మాట్లాడలేదు.

"అక్కయ్యగారికి ఏమీ పరవాలేదు నేనిప్పుడే అక్కణ్ణుంచి వస్తున్నాను, డాక్టరుతో మాట్లాడాను" అన్నాడు మురారి.

రమణారావు అప్పటికీ ఏమీ మాట్లాడలేకపోయాడు. లేదు. మురారి అబద్ధం చెబుతున్నాడు కాళింది చనిపోయింది. నేనీరోజు చేసిన పాపఫలం కాళింది అనుభవించింది అని గొణుక్కున్నాడు.

మురారి రమణారావుని బలవంతం చేసి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు. ఆమెకింకా స్పృహరాలేదని. ప్రమాదం లేదని చెప్పాడు డాక్టర్.

ఆ రాత్రి మురారి చాలా సేపటివరకు వుండి ధైర్యం చెప్పి వెళ్లిపోయాడు. రమణారావు అక్కడే కునుకు తీశాడు. పీడకలలు రాసాగాయి. కాళింది తనను విడిచి ఆకాశములోకి ఎగిరిపోతున్నట్లు అనిపించింది. తన ఆదర్శాలను వమ్ము చేసినందుకు దుఃఖిస్తున్నట్లు కన్పించింది.

అప్పుడప్పుడూ పులిక్కిపడి లేచేవాడు. స్పృహతప్పి పడి వున్న కాళిందివంక దీనముగా చూసేవాడు. "కాళిందీ, యింకెప్పుడూ నీ కిష్టంలేని పని చెయ్యను, నన్నువిడిచి వెళ్లకు" అని గొణుక్కునేవాడు. మళ్ళీ కునుకు తీసేవాడు.

తెల్లవారుఝామున కాళిందికి తెలివి వచ్చింది.

అప్పట్నుంచి ఆమె భర్తతో మాట్లాడుతూనే వుంది. రమణారావు ఆనందముతో ఉక్కిరిబిక్కిరయ్యాడు, చనిపోయిన భార్య బ్రతికి వచ్చినందుకు కల్గిన సంతోషం భరించసలవి కావటంలేదు,

ఉదయము ఎనిమిదిగంటలకు మురారి పద్మను, రవిని వెంటబెట్టుకొచ్చాడు.

"అక్కా! ఎలావుంది" అని పలకరించాడు.

"మురారీ! రాత్రి నాకోసము చాలా సేపు మేలుకునేవున్నావటగా?" అంచి కాళింది-

మురారి నవ్వాడు. రాత్రి పిల్లిద్దరూ నా దగ్గర పడుకున్నారక్కా! బామ్మగారు అన్నంపెట్టింది, ఉష బామ్మను వదిలి రాలేమ పెంకిది" అన్నాడు

రమణరావు ఆరోజుకి సెలవుపెట్టి కాళింది దగ్గరే వుంటానని పట్టు పట్టాడు. "ఎందుకండీ అనవసరంగా, మీరువెళ్లండి నాకేం భయం, పిల్లలు న్నారు" అన్నది కాళింది.

"నేనూ వున్నాను, మీరు వెళ్లండి, అక్కదగ్గరే ఉంటాను" అన్నాడు మురారి-

అయిష్టంగానే ఒప్పుకున్నాడు రమణరావ్ బంధుత్వాలు ఏమీ లేక పోయినా కల్పించుకున్న బాంధవ్యముతో సహాయపడే మురారిని మెచ్చుకున్నాడు రమణరావు.

ఆఫీసుకెళ్లి సీట్లోకూర్చున్నాడు. రాత్రి సరిగా నిద్ర లేకపోయినా ఎంతో ఉల్లాసముగా వున్నాడు రమణరావు, నిన్నటికి యీ రోజుకి ఎంత తేడా! అనుకున్నాడు.

నిన్నంతా కష్టపడి వ్రాసిన జగన్నాధరావు కేసు తాలూకు కాగితాలు చించి చెత్తబుట్టలో పారేశాడు గుండెలమీదనుంచి బరువు తీసినట్లు హాయిగా వూపిరి పీల్చాడు.

ప్రక్కన కూర్చున్న గుమాస్తా ఎవరితోనో అంటున్నాడు. "ఎన్నాళ్లు చేస్తే ఏముందిరా? గుమాస్తా జీవితం గొర్రెతోకేగా" అని.

రమణరావుకి నవ్వొచ్చింది.

గుమాస్తాజీవితం గొర్రెతోకలాంటిదే! సందేహం లేదు, గొర్రెకు బెత్తెడుతోకే వుండటం వలన దానికుండే ఆనందం ఏమిటో ఎవరికి తెలుసు దానికితప్ప, అనుకున్నాడు రమణరావు.

ఆ సాయంత్రం జగన్నాథరావు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వచ్చినప్పుడు "నన్ను క్షమించండి" అని అయిదువందల రూపాయలు తిరిగి యిచ్చాడు రమణారావు.

ఆయన ముఖంలో నవ్వు మాయమై ఆ స్థానే ఉక్రోషం కోపం పోటా పోటీలుగా వచ్చాయి.

"చెడిపోయేవాడిని ఎవరూ బాగుచేయలేరు. ఎప్పటికీ యిలాగే గొర్రెతోకలాగే వుండు. నీకు ప్రమోషన్ వచ్చినప్పుడు అడుగు. మీసం గొరిగించుకుంటా" అన్నాడు జగన్నాథరావు రుసరుసలాడుతూ.

"నేను గొర్రెతోకనే" అన్నాడు రమణరావు గట్టిగా.

జగన్నాథరావు విసురుగా రంగంలోంచి నిష్క్రమించాడు. *

ప్రచురణ : ప్రతిభ సచిత్ర వారపత్రిక, 27-9-68